గుండ్లకమ్మనది... దాని పరీవాహక ప్రాంతం.

రెండుగట్ల మధ్య ఎండిన ఇసుక పఱ్ర బంగారు రంగుతో మెరుస్తోంది. అక్కడ జలాంశ ఓ సంశయ అంశగా మిగిలి ఉంది. నీటివాలుకు తడిసి ముద్దయి కలిసి విరియాల్సిన ఇసుక పంట శేష ప్రశ్నగా మిగులుతోంది.

ఎండిన గుండ్లకమ్మతో కలిసి అచేతనమై మేటల రాశులతో మమేకమై ఉంది మినుకు మంటూ మనుగడ సాగిస్తున్న పొగనారు పంట. ఎప్పుడో ఒకసారి దొరికిన నీటిమూట



# పవనం కాలేదు

**వడలి రాధాకృష్ణ**

మినుకులోని తేమను తనదిగా చేసుకుని, తద్వారా ఏపుగానే ఎదుగుతోంది పొగనారు.

పెరిగిన పొగాకును త్రుంచి, తాటాకు పాక కోని నీరెండలో ఎండేసి రంగుమారిన తర్వాత బ్యారన్‌కి ఎక్కిస్తున్నారు సూరారెడ్డిపాలెం సన్న కారు రైతులు.

'కిష్టాలురాజు రెండు క్వింటాళ్ళు 'ఎ' గ్రేడ్ బేళ్లు పంపమన్నాడు బుడ్డయ్యా' గబగబా వచ్చి ఆర్డరు చెప్పేసి తన పాత టీవీయస్‌ని స్టార్ట్ చేశాడు గుమాస్తా.

'కిష్టాలురాజు సెబితే రెండేంటి? బ్యారన్ కాడ ఇరవైరెండు క్వింటాళ్లు తయారుచేసి పంపు తాము' కాటా దగ్గర ఎక్కువ తక్కువల్ని సరి చూస్తూ అంటున్నాడు బుడ్డయ్య.

నాలుగు రోజులలో తెల్లదొరలు దిగుతు న్నారు. పాతిక రకాలు చూపించాల. వాళ్లను మెప్పిస్తే మన దశ మారతాది! అయినా నువ్వె ప్పుడు పంపేది? ఆడోళ్లు ఎప్పుడు గ్రేడింగ్ చేసేది? మళ్ళా బేళ్లు ఎప్పుడు కట్టేది? కదులు తూ అరుపులా అన్నాడు గుమాస్తా.

గురుమూర్తిరాజు కంపెనీకి బేళ్లు ఎత్తారంటే మూడు రోజులకల్లా సొమ్ములువచ్చి చేతిలో పడతాయనేది సూరారెడ్డిపాలెం వాళ్లకి ఓ నమ్మ కం. అందుకే కిలో ధర రెండు రూపాయలు తగ్గించి వేసినా అందరూ గురుమూర్తి రాజు కంపెనీనే ఎక్కువగా నమ్ముకుంటారు.

వాళ్ల నమ్మకాన్ని నిలబెడుతూనే ఉన్నాడు కిష్టాలురాజు. గుండ్లకమ్మ ఎండిపోయి పొగ నారు మాడిపోతున్నా ప్రతిసారీ ఫిల్టర్ పాయిం టుకి అడ్వాన్సులు ఇచ్చి పంటను కాపాడు తున్నాడు. తద్వారా రైతును నిలబెడుతూనే ఉ న్నాడు. అందులో కంపెనీ యజమాని కిష్టాలు రాజుకి కొంత స్వార్థం లేకపోలేదు.

ఇప్పుడు అడ్వాన్సులు ఇస్తాడు. రేపు పంట చేతికొచ్చిన తర్వాత 'ఎ' గ్రేడు పొగాకును మీడి యం గ్రేడుగా తీసుకుంటాడు. తిమ్మిని బమ్మి చేసి సూరారెడ్డిపాలెం ప్రాంతంలో బాగానే నిల దొక్కుకున్నాడు.

వయసురీత్యా బాధ్యతల్ని గురుమూర్తి రాజు కొడుక్కి ఒప్పగించిన తర్వాత కిష్టాలురాజు ఈ రోజు పేరు మోసిన పొగాకు వ్యాపారిగా ఎది గాడు.

తమ ప్రాంతంలోని ఇతర కంపెనీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న న్యూటెక్నాల జీని అందిపుచ్చుకొని కొత్త మిషన్లని బిగిస్తూంటే అతను తన తండ్రి కాలంనాటి సాంప్రదాయక పద్ధతుల్నే అనుసరిస్తున్నాడు.

మేన్యువల్ స్టెమింగ్ విధానాన్నే ఇంకా కొన సాగిస్తూన్నందున రోజూ రెండు మూడు వందల మంది ఆడకార్మికులకు ఆధారం చూపిస్తున్నాడు కిష్టాలురాజు.

శివరాత్రి వెళ్లిపోయింది. చలికూడా శివ శివా అంటూ ఎగిరిపోయింది. అంతకు ముంద ర మంచు తెరలను చీల్చుకొని బయటకు

రావడానికి ప్రయాసపడ్డ సూరీడు ఇప్పుడు అన్నింటినీ వెనక్కి నెట్టేసి ముందుకు వచ్చి మరీ విరగకాస్తున్నాడు.

ఎండలు బాగా ముదురుతున్నాయి. ఉద యపు చల్లదనానికి మైమరచి విన్పించే పిట్టల గొంతులు మధ్యాహ్నమయేసరికి చెట్టు గుబురు మాటులో అదృశ్యమవుతున్నాయి.

మధ్యమధ్య ఉన్నట్టుండి వేడిగాలులు అద రగొడుతున్నాయి. గ్రేడింగ్ షెడ్లలో ఆడకూలీలు పొగాకు కాడను వేరుచేస్తున్నారు. తర్వాత గ్రేడ్ ప్రకారం పెడుతున్నారు. ప్రతివరుసలోనూ ఆడ మేస్త్రీలు అటూఇటూ తచ్చాడుతూ కావాల్సిన పొగాకును అందిస్తున్నారు.

బుడ్డయ్య పంపిన బేళ్లను షెడ్డులో పరి చారు.

తర్వాత కావాల్సిన గ్రేడ్లను ట్రాక్టరుకు ఎక్కిం చాలన్న తొందరలో ఉన్నారు. వట్టివేళ్లు చాపలు కట్టిన పెంకుటింటి ఆఫీసుషెడ్డులోని నవ్వారు మంచంమీద కూర్చొని అక్కడి పనినీ... పని జేసే ఆడాళ్లనూ సునిశితంగా గమనిస్తున్నాడు కిష్టాలురాజు.

తమ యజమాని గురించి, అతని సన్నటి కోరమీసాల గురించి, ఒత్తుగా పెరిగిన జుట్టు గురించి, వేసుకున్న తెల్లటి గ్లాస్కో చొక్కా... చొక్కాజేబులోని ఐదువందల రూపాయల నోట్ల గురించీ తమలోతాము రోజూ చర్చించు కుం టూనే ఉంటారు ఆడకూలీలు.

తన తండ్రి గురుమూర్తిరాజులా అంతగా



నెల్లూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో సోమిరెడ్డి జమున స్మారక సాహిత్య అవార్డును అందుకుంటున్న ప్రముఖ కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్య. చిత్రంలో అవార్డు ప్రధాత డా॥ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, ప్రముఖ కవి రామచంద్రమౌళి, పెరుగు రామకృష్ణ, పాతూరు అన్నపూర్ణ ప్రభృతులు ఉన్నారు.

కంగారుపడే తత్వంకాదు కిష్టాలురాజుది. ఆయన అయితే తెల్లదొరలకు గ్రేడెడ్ పొగాకు చూపించీ బాగా ఆర్డర్లు సంపాదించాలని తాపత్రయపడేవాడు. కానీ కిష్టాలురాజుకి ఎప్పుడూ అదృష్టం కలిసివస్తూనే ఉంది.

ఆడకూలీలను, వారికట్టుబొట్టుల్ని, మండుటెండలో చెమటల కొలిమిలో మగ్గిపోయి నల్లగా తయారయిన శరీరపు పటుత్వాలనూ పరికించి తనలో తాను పరవశిస్తూనే ఉన్నాడు. ఆరో వరుసలో వయసుఉడుకుతూన్న ఆడంగుల మధ్య అప్పుడప్పుడూ ఓ పదునైన చూపో... మరో చిరునవ్వో, పెదవులపీడనమో అస్పష్టంగా తనకేసి వస్తున్నట్లే అనిపించినా కోరమీసాల్ని మెలివేసుకుంటూ అంతగా పట్టించుకోవడం లేదు కిష్టాలురాజు.

క్రమంగా వారం దాటిన తర్వాతగానీ విషయం పూర్తిగా బోధపడలేదు. పోతూపోతూ చూపుల్ని అతని కనుకొలనుకేసి విసిరిపోవడం, చిరునవ్వుల్ని అతని మీసాలమీదకు వదిలి వెళ్లడం పొగాకు గ్రేడింగ్‌కోసం ఆరోవరుసకు వచ్చినపుడు తడబడటం, ఆమెలో ఏవో కొత్త వొంపులు మెరవడం రాజులోని రాజసం ఉట్టిపడేలా చేశాయి. కాడతీసిన తర్వాత వేరుచేసిన ఆకు భాగాన్ని వెదురుగంపలో నింపుకొని గ్రేడుప్రకారం ఉంచిన బిన్‌లో నింపడానికి వెళుతూన్న ఆమె కండరాల సొగసు కిష్టాలురాజు మనసుని లొంగదీసింది. అప్రయత్నంగానే చెమటతో తడిసి ముద్దయిన ఆమె బాహువుల్లోకి అతని చూపులు చొచ్చుకొని బంధాలు ఏర్పరచుకొనేవి.

రోజూ గ్రేడింగ్ మొదలయ్యేది ఉదయం ఏడుగంటలకయితే ఆరున్నరకే ఆమె ప్రత్యక్షమవుతుంది. ఉదయిస్తూన్న ఉల్లాసంలా... వెలుగులు విసురుతూన్న చిన్న భానుడిలా ఆమె... కొన్నిరోజులకే వాళ్లు పరస్పరం కడగంటి చూపులతో పలకరించుకోవడం, పెదాల ఎరుపుల వెనుకనుండి పలువరసల ముత్యాలతో మూగ ఊసులాడు కోవడంతో మాటలు కలవకుండానే పరిచయస్తులయ్యారు. అంతకుముందు కంపెనీ వ్యవహారాలు గుమాస్తాల మీద వదిలేసి ఎక్కువగా బయటతిరిగే కిష్టాలు రాజు ఇప్పుడు కుదురుగానే ఉంటున్నాడు. రోజూ అంతమంది ఆడంగులలో ఆమె కోసం అతని చూపులు చురుకుగా వెతికేవి.

సాయంత్రాలు పనులు ముగించుకొని కేరియర్ చేతబట్టుకొని వెళుతూన్న కూలీల మధ్యలోని ఆమెను చూస్తూ కనుమరుగయ్యే వరకూ కన్ను ఆర్పేవాడుకాదు. రోజూవేసే మస్తరులో ఆమెపేరు 'గంగాజలం' అని వ్రాసి ఉన్నా తను మాత్రం 'గంగ'గానే గుర్తుంచుకున్నాడు.

అంతకుముందు అదోలా ఉండే యజమానిలో ఓ కొత్త ఉత్సాహం, దేనికోసమో వెతుకులాటలను జీవితంలో ఎంతో అనుభవాన్ని సంపాదించిన ఆడకూలీలు ఇట్టే పసిగట్టేశారు. మేస్త్రీగా పనిజేస్తున్న మణమ్మ అయితే ఎవరూ లేకుండా చూసి కిష్టాలురాజుని అడగనే అడిగింది. ఒక్కక్షణం సిగ్గుపడి ఆ విషయాన్ని అక్కడితో ఆపేసి తెల్లదొరల గురించి, వర్జీనియా పొగాకు గురించీ మాట్లాడటం మొదలుపెట్టాడు.

తర్వాత 'గంగాజలం' మీద ఆసక్తి కాస్తా వ్యామోహంగా మారి కిష్టాలురాజుకి పెద్ద సునామీ అయికూర్చుంది. బిగువైన అందాలతో వశం తప్పించి అందాలతో నల్లద్రాక్షపండులా ఊరిస్తూన్న ఆమెతోటి ఊహలు అందని పుల్లద్రాక్షలా అన్పించాయి ఇన్నాళ్లూ. కానీ మధ్యలో మణెమ్మ ప్రోత్సాహకరమైన మాటలు అందని వాటికోసం ఎగిరిపడేలా చేస్తున్నాయి. 'తెల్ల

దొరలు వచ్చేది ఆపై ఎల్లుండే! మేలురకం పొగాకు ట్రాక్టరు కెత్తాల' మణెమ్మతో సంప్ర దించాడు.

'కొంతమందికి ఓవర్‌టైం ఇస్తేనేగానీ ఐదో ట్రాక్టరు లోడు కష్టం అవుతుంది'. మణెమ్మ చెప్పినట్లే చేశాడు. వారిలో గంగాజలం ఒకత్తి. మంచివెన్నెల... పున్నమివెన్నెల. ఆవల కన్పించే గుండ్లకమ్మ వెలుగు నీడలో అందాల గంగా జలం పారుతున్నట్లుంది. ఓప్రక్క సూరారెడ్డి పాలెం వెన్నెలముసుగులో మత్తుగా సేదదీరు తోంది.

గంగ తనకేసి చూసి ఏదో సైగలతో పలక రించినట్లుంది. అది భ్రమే అయినా మరోవైపు అనుమానంగా ఉంది. ఆమె మీద అంతులేని కాంక్ష నెలకొనిఉంది కిష్టాలురాజులో. నిగారిం చిన ఆమె అందాలపై కోరిక ఉంది. ఆ మౌన భాష పట్ల మమకారం, ఆపేక్ష ఉంది.

ఆఫీసులో ఎవరూ లేనప్పుడు చల్లని మంచి నీళ్ళ కోసమని కూలీలు వస్తుంటారు. అప్పుడు గంగాజలాన్ని అందుకోవాలని ఉబలాటపడ తాడు కిష్టాలురాజు. ఏదో క్షణాన ఆమె తనకు దగ్గరవుతుందన్న ఊహ కిష్టాలురాజుని నిల బెడుతూనే ఉంది.

మెల్లిగా పెంకుటి వసరా ఆవలివైపుకు మంచాన్ని మార్చుకున్నాడు. ఆలోచనల నిండా ఆమె నిండిఉండటంవల్ల కనురెప్పలు భారంగా వాలి చిలిపి ఊహలకు తెరతీస్తున్నాయి. ఉన్న అందరూ పనుల్లో మునిగిపోయి ఉన్నారు. పెంకుటింటి చావడిలో ఆకారం ప్రత్యక్షమయిం ది. తల తిప్పకుండానే కనురెప్పల్ని పెకిలించి చూశాడు.

'గంగాజలం'... వెతుకుతూన్న సుమధుర స్వప్నం కంటి ఎదుట సాక్షాత్కరించిన అను భూతి. యజమానిని పట్టీ పట్టనట్లు చూస్తూ మెల్లిగా లోనికొచ్చింది. అతను నిద్రిస్తున్నాడనే అనుకొంది. ఐదు అడుగుల దూరంలోని ఫ్రిజ్ లోని చల్లని నీరును తన ప్లాస్టిక్ జగ్‌లోకి ఒంపుకుంటోంది.

ఆమెచీర రెపరెపలు అరికాళ్లకు సోకి అతని గుండెకు పులకింతను కలుగజేసింది.

ఆమె శరీరపు కష్టం తాలూకు వాసన ఆ వసారా అంతా ఆవరించింది. కుళాయిలోంచి నీళ్లు లయబద్ధమైన చప్పుడు చేస్తున్నాయి. రెండుక్షణాల తర్వాత నిశ్శబ్దం.

ఆ సన్నని అడుగుల సవ్వడి గుండె గదు ల్లోకి ప్రయాణించింది.


మంచం ప్రక్కగా నడుస్తోంది. కిష్టాలురాజు నరాలన్నీ బిగుసుకున్నాయి. శరీరమంతా ప్రకం పనల వలయమైంది. గంగ బయటకు జారు కుంటుందేమోనన్న ఆతృత.

ఇంకా నిద్ర నటించడమా? లేక కళ్లుతెరిచి ఆమెను' అడ్డుకోవడమా? నిర్ణయించుకోలేని పరిస్థితి. అతని ఆలోచనలు నిద్రాణస్థితిలో ఉండగానే ప్లాస్టిక్‌మగ్ ఆమె చేతిలోనుంచి జారి క్రిందపడింది. చటుక్కున లేచి కూర్చున్నాడు.

'అమ్మో! చేయిజారింది...' చటుక్కున కదల బోయింది. అమాంతం కదిలాడు. అడ్డుపడిన కామందు కాలు తగిలేసరికి తూలి పడబోయిం ది. చటుక్కున గంగను వడిసి పట్టుకున్నాడు. అరచేతిలో చిక్కుకున్న ఆమె జబ్బకండల బిగు వు అంతటి ఉత్తేజ స్థితిలో కూడా అతన్ని ఆశ్చర్య పరచింది.

దగ్గరకు లాక్కోబోయాడు.

'ఇప్పుడుకాదు... ఐదో ట్రాక్టరు లోడు




పోవాలి...' అంటూ విడిపించుకొని తుర్రున తూనీగలా పరుగుతీసింది. కిష్టాలు రాజు కళ్లు మత్తుగా ఉన్నా మూతపడటం లేదు. మంద్రతగాలిపే ఆలోచనలు రంగు రంగుల అనుభవాల కోసం అర్రులు చాస్తోంది.

తన గుండెల్లో ప్రవహించే వెచ్చటి సెల యేరు గంగను పచ్చని పార్శ్వానికి సమాయత్తం చేస్తోంది. ఐదో ట్రాక్టరు లోడు ఎత్తడం పూర్తయింది. లోడుతోబాటు ఆడకూలీలూ సర్దుకున్నారు. ముఖాన్ని దోసిట్లోని చన్నీటితో కడుక్కొంది. ఓ క్షణం చల్లబడిన తర్వాత జొడ్డాస పైటచెరగుతో అద్దుకొని తర్వాతి అంకంలోకి రానేవచ్చింది.

లోకమంతా పరుచుకొన్న వెన్నెల ప్రవాహమై వెల్లువై తన గుండెల మీద నుండీ దూకినట్లనిపించింది అతనికి. గాలీ... నేలూకీ మమేకమై గుండె పుంతల్ని దాటుతూ కానరాని చెలి మంటలతో కాలుతున్నాడు. గంగకు పరీవాహకమై తీరాన్ని తాకుతూ గట్టుల్ని సైతం ఛేదించాలన్న ప్రణయగర్జనలతో ఆమె.

తెలిసిన అనుభవమే అయినా ఇద్దరిలోనూ ఆరాటం. చేతులస్పర్శ, పెదిమల సంపర్కం... ఓ, కౌగిట వెచ్చదనం పులకింతల వాకిట్లో పరవశాల సమ్మోహనం. గంటలు క్షణాలుగా కదులుతూంటే ఒకరిలో ఒకరు ఏమీ మిగలకుండా మమేకమై మిగిలారు.

అలామొదలయింది వాళ్ళ శారీరక అనుబంధం. గంగాజలాన్ని తేరపార చూశాడు. చూసిన ప్రతిసారీ కొత్తగా అగుపిస్తూనే ఉంది. తనకు ఇంత పరవశాన్ని పంచి ఇస్తున్న ఆమెకు కూలి డబ్బులు అదనంగా ఇవ్వబోయాడు.

'ఎందుకు...?' చీరకుచ్చిళ్ళను సర్దుకుంటూ అంది. 'డబ్బు ఎందుకేంటే పిచ్చి మొహమా! రేపు కొత్త చీర కట్టుకొని ఫెయిర్ అండ్ లవ్‌లీ రాసుకువద్దువు...

కిష్టాలురాజు కేసి పైకీ క్రిందకీ చూసింది. నీ దగ్గర పడుకున్నందుకా!

'అదేం కాదు...' కోరమీసాల కిష్టాలురాజు మొదటిసారిగా ఒక ఆడదాని దగ్గర తడబడ్డాడు. ఆమె అలా అంటుందని ఊహించలేదు.

మరిన్ని వందల కాగితాలని బయటకు తీయబోయాడు... అంతలోనే తమాయించుకొని సర్దుకున్నాడు.

'నీ మగబుద్ధి పోనిచ్చుకున్నావు గాదు!' వందల కట్టను మంచం మీదకు విసిరి కొట్టింది. చిన్నబోయాడు కిష్టాలురాజు. తన క్రింద వాళ్ల దగ్గరా ఆత్మాభిమానం ఉంటుందని అప్పుడే గ్రహించాడు. అతనిలోని ప్రణయావేశం కొద్ది కొద్దిగా కరుగుతోంది. దాని స్థానం ప్రేమావేశంతో భర్తీ అవుతోంది.

"లెక్క కోసమే నీ మంచాన్ని, నిన్నూ పంచుకుంటున్నానని నీ ఉద్దేశ్యంకదూ?"

'కాదు గంగా... నువ్వు నాదానివి!' ఎర్రగా ఉన్న ఆమె కళ్లు వర్షించాలని ఉబలాటపడే వేసవి మేఘాల్లా వాడిగాను, వేడిగానూ అగుపిస్తున్నాయి. కానీ ఆ గొంతులో కొంత నిశ్చలత అగుపిస్తోంది.

లేచి ఆమె వైపు తిరిగాడు. తనివితీరా తన కౌగిలిలోకి తీసుకున్నాడు. ఆమె కన్నీటిని తన ముఖస్పర్శతో అద్దాడు. గంగను మామూలుగా సంతోషంగా ఉంచడానికి శతవిధాలా ప్రయత్ని



డా॥ పెల్లకూరు జయప్రద సోమిరెడ్డి గారికి 'బెస్ట్ డాక్టర్ విత్ హ్యూమన్ టచ్' అవార్డ్‌ని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ కాంపౌండ్, డా॥ నందమూరి తారకరామారావు కళామందిరం వేదికపై హెల్త్‌కేర్ ఇంటర్నేషనల్ సేవా సంస్థవారు అందజేసారు. చిత్రంలో (ఎడమ నుంచి) నిమ్స్ ఫార్మర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు, గవర్నర్ ఆఫ్ సిక్కిం శ్రీ వి. రామారావు. ఎ.పి. హౌసింగ్ సెల్ కన్వీనర్ శ్రీ జె. భాస్కర్, హైకోర్ట్ అడ్వకేట్ శ్రీమతి యం. వెంకటేశ్వరి.

స్తున్నాడు.

నెమ్మదిగా తేరుకొని ఆమె నోరు విప్పింది. 'నిన్ను... నీ పొగాకు పొకల్ని చూసి పక్కలోకి రాలేదయ్యా! నీ కోరమీసాల్ని చూసి ముచ్చట పడ్డా... నీ రాజుతనానికి కరిగి ముచ్చటపడ్డా... నీ కొంటె చూపులను చూసి ముచ్చటపడ్డా... నీ ఒళ్లు నచ్చి, నీ మగతనం చూసి... నీ దగ్గర దొరికే ఒంటి సుఖం మెచ్చి దగ్గరయ్యాను. అంతేగానీ నీ వందలకట్టలు నచ్చి కాదయ్యా!' విసురుగా చెప్పింది.

గోడ గడియారం గంటలు మ్రోగించింది. గంగాజలంలోని ఆ మాయితే కిష్టాలురాజుని ప్రేమపాశంతో కట్టేస్తోంది. అక్కడి ప్రతి పొగాకు చేనూ కిష్టాలురాజు, గంగాజలాల మధ్య ఏర్పడ్డ సంబంధాన్ని ఇట్టే పసిగట్టేశాయి.

'నువ్వు తప్పేమీ చేయలేదు రాజా! అయినా అదేమైనా పెద్ద పతివ్రత అనుకుంటున్నావా?'

'గంగాజలం సంగతి మాకు ఎరుకే! దానికి మొగుడున్నాడు. వాడు ఎందుకూ పనికిరాడు. దీనికి ఆడి గురించి పట్టదు. ఇప్పుడు నీతో ఇలా...! మణెమ్మ మాటలు అతన్ని ఆలోచనల్లోకి నెట్టేశాయి.

'సరళమ్మ ఎలా ఉంటదయ్యా! నాలాగుంటదా! ఓమారు చూపించరాదూ!!'

'ఎలాగోలా ఉంటది... నీ అంత అందంగా మాత్రం కాదు' గంగాజలాన్ని దగ్గరకు తీసుకుంటూ అన్నాడు. 'నీ కోర మీసాలతాకిడికి ఆమె అందం కాస్తా కరిగిపోయుంటాదిలే! అతని గుండెలమీద వాలిపోతూ అంది.

ఏముందిలే! ఒర్షి పోయిన కాలపుత్రైవు. మనకు వాలడంలేదు. అయినా నీ మోజులో పడ్డాక అటు మనసుపోవడం లేదు.

'నిజంగా?....' ఆమెకళ్ళలో మెరుపును అతను గమనించకపోలేదు. 'ఏనోడు ఏట మాంసం తెచ్చిపడేస్తే... మసాలాలు దట్టించి మటను అదరగొట్టేలా వండిపడేస్తది!'

'అయితే అక్కడ బాగా లాగించేసి ఇక్కడ మంచం ఎక్కేస్తావన్న మాట!!' పకపకానవ్వాడు కిష్టాలురాజు. 'అయినా ఆడదాని మనసు ఆడదానికే తెలుస్తదయ్యా!'

'గంగా నువ్వుండవలసిన దానివే!!'

'ఉండక చస్తానా... ఉంటాను మా రాజా!'

'మొన్నే సరళ వదిహేను సవర్ల జిగినీ గొలుసు చేయించుకొంది. అది నీ అందానికి బాగా నప్పుతుందనిపించింది!'

'తెల్లదొరలు... పోనీ!

నీకు మరోటి ఆర్డరిస్తా!!'

'చెప్పాగదయ్యా! నీ కండల సునుపుకి దగ్గరయ్యాగానీ కాసుల కక్కుర్తితో కాదని' గంగాజలం ఎప్పటికీ అర్థంకావడంలేదు కిష్టాలు రాజుకి.

'సరే రాజూ... మన సంగతి సరళమ్మకి తెలుసంటావా?'

'తెలుసని అనుకోను. తెలిసినా ఆడది ఏం చేస్తది? అసలే తెగించినోణ్ణి!'

'మా మంచి రాజువయ్యా! నిన్నొదిలి నేనుండగలనా చెప్పు' మరీ దగ్గరవుతోందామె కిష్టాలు రాజు క్రమంగా ఆమెలో ఐక్యమవుతున్నాడు.

గంగాజలం కిష్టాలురాజుతో తిరుగుతోందని ఆ పొగాకు కంపెనీలో అందరికీ తెలిసిపోయింది. కొంతమంది ఆడోళ్లకయితే యజమానిని బుట్టలో వేసుకుందని అసూయ...

తమకురాని అవకాశం తన్నుకుపోయిందన్న అక్కసు. చాటుగా ఆమెను అందరూ దుమ్మెత్తి పోస్తున్నారు. కానీ ఆ మాటలు ఆమె విన్పించు కొనే స్థితిలో లేదు.

ఎప్పటిలాగే గంగాజలం పడమటి వైపు పెంకుటింటి వసరాలోకి వచ్చింది. కిష్టాలురాజు మంచంమీద కూర్చొని ఉన్నాడు. అతని ముఖం లో కొంత చికాకు. దాని వెనుక అసహనం. ఆ మాటలతో కొత్త అర్థాలు కన్పిస్తున్నాయి. కప్పులో పోసిఇచ్చిన కాఫీని ప్రక్కన పెట్టి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. కాదనలేదు... అతని ఒళ్లోకూలబడింది.

'రాత్రి సరళ నిలేసింది! నిన్ను పనిలోంచి తీసేయకబోతే ఏదైనా మింగి చస్తాదట!!' అమెను తన బిగికౌగిట్లో బంధిస్తూ అన్నాడు.

'నువ్వేమన్నావ్?'

'తన దగ్గర లేనిదాని కోసం మగాడు మరో చోట ప్రయత్నిస్తే ఆడది సహించదు!' 'సరళమ్మ నన్ను తనకి సవితిగా ఊహిం చుకుంటోం దేమో! చిన్నగా నవ్వింది. 'కాదా మరి...' ఆమె పెదిమలను ముద్దాడబోయాడు.'

'గంగా నువ్వు నాకు కావాలి! నీ కోసం దేనికైనా తెగిస్తాను!'

మొదటిసారిగా అతనికి కొంచెం దూరంగా జరిగింది గంగాజలం.

'అవును గంగా... నా సాక్షిగా... నా వ్యాపారాల సాక్షిగా నిన్ను ప్రేమిస్తున్నాను!

'నిన్ను కాదన్నదెప్పుడూ!'

'కానీ' ఏవో చికాకులు. నీ గతం, నీ వ్యక్తి గతం నాకనవసరం. నిన్ను ప్రేమిస్తున్నాను. ప్రేమిస్తూనే ఉంటాను. కానీ సరళరూపంలో ఈమధ్య అన్నీ అడ్డంకులు నాకు.


'అందుకే... ఈనెలాఖరుకు బెంగుళూరు వెళతాం! వ్యాపారం లావాదేవీలు పూర్తిచేసు కుంటాం!! తర్వాత సరళ నాతో ఇక్కడికి రాదు. 'అప్పుడు సరళ స్థానంలో నువ్వు... మనకు ఇప్పుడున్న ఆపాటి ఇబ్బందీ తొలగిపోవాలని!'

'తర్వాత మన గురించి చెడుగా మాట్లాడే వారు ఎవరూ ఉండకూడదు!' 'అంతా నీ కోస మేనే పిచ్చిమొద్దూ!' ప్రేమగా దగ్గరకు లాక్కోబో యాడు.

ఈసారి కావాలనే మరింత దూరంగా జరి గింది గంగ. 'మా ఆయన అనామకుడే. కాద నను. కానీ అప్పుడప్పుడూ కూర్చోబెట్టి పిట్ట కథలు అల్లిచెబుతాడు. అణ్ణి నేను ఎంతకాదను కున్నా తాళినీ, బొట్టునూ ఇచ్చినోడు.

'ఒక రాజకుమారుడు, అతగాడి ప్రియు రాలు. ఓరోజు ఆమెను గుర్రం ఎక్కించుకొని అలా తిప్పడానికి తీసుకెళ్లాడట. ఒకచోట కొలను దగ్గర హాయిగా తిరుగుతూ రెక్కల్ని ఆడిస్తున్న ఓ అందమైన తెల్లహంస కంట పడింది. దాన్ని చూసి ప్రియురాలు చాలా ఆనందించింది. అదే విషయం రాజకుమా రుడితో చెప్పింది. ఆమె ఆనందాన్ని కోరుకునే అతగాడు ఆ తెల్లహంసను కానుకగా సమ ర్పించి తన ప్రియురాలి ప్రేమను పెంచుకోవా లని అనుకున్నాడు. వెంటనే గుర్రందిగి ఆ కొలను దగ్గరకు నడిచాడు. అందమైన ఆ తెల్ల హంస రెక్కల్ని తెగకోసి ఆమెకు సమర్పించాడు. ఆ రాజకుమారి చాలా నొచ్చుకుంటుంది.

అతని చేతులనిండా రక్తం. రక్తసిక్తమై ఉన్న హంసరెక్కల్ని, వాటిని తీసుకొచ్చిన రాజ కుమారుడినీ అసహ్యంగా చూసి, అక్కడి నుండి పరుగెత్తి పారిపోతుంది ప్రియురాలు. నీ సుఖం




కోసం... నీకు పొందునిచ్చిన నా మెప్పుకోసం... నిన్నే నమ్ముకున్న మనిషికి అపకారం తలపెడుతున్నావు. ఒకరకంగా చెప్పాలంటే నిన్ను చూస్తే ఇప్పుడు రక్తం రుచిమరిగిన పులి గుర్తుకు వస్తోంది నాకు. అసలు పులి రక్తం రుచి చూడనంత కాలం చాలా సాధుజంతువు. ఈ రోజు రక్తం త్రాగిందంటే రేపు మరొకరిని వేటాడదన్న నమ్మకం లేదు.

సరళమ్మ నీకు చేసిన అన్యాయం ఏమీ కన్పించడంలేదు నాకు. ఆమె చాలా మంచి మనిషి. తనదైన ఓపిక, సహనాలతో నీ చీకటి వ్యవహారాలని కొంతవరకూ సహించింది. ఇప్పుడు నీ చేతుల నిండా కన్పించని రక్తాన్ని చూస్తున్నాను నేను. సరళమ్మను తుదముట్టించి నన్ను పెళ్లి చేసుకుంటే ఓ తెల్లకాకిని నేను కొని తెచ్చుకున్నట్టే. అప్పుడు నీ రక్తపు చేతులలో నేను కుంచించుకుపోతాను.

> తన సామర్థ్యం సాయంతో మనిషి జీవితంలో అత్యున్నత శిఖరాలను చేరుకోవచ్చు.
> అయితే అక్కడ నుంచి పడిపోకుండా ఉండాలంటే మాత్రం మచ్చలేని నడవడిక ముఖ్యం.

ఏ క్రమమైనా మగాడి స్పర్శ ఆడదానిలో ఉద్వేగాన్ని, ఉల్లాసాన్నీ కలుగజేయాలిగానీ అసహ్యంగా మనసు రాయిగా మారి ముడుచుకుపోయేలా చేయకూడదు. అది నాకు ఆనందాన్ని ఇవ్వదుగదా. నీ మోసకారితనం నేను బ్రతికున్నంత వరకూ వెంటాడుతూనే ఉంటుంది. అంటూ వడివడిగా రోడ్డునపడింది గంగాజలం. వెనక్కి తిరుగుతుందేమోనని ఎదురుచూస్తున్నాడు...

కానీ ముందుచూపువైపు దృష్టి సారిస్తూ సుదూరంవైపు సాగుతూ కన్పిస్తోంది. ●